

ఫీవర్రీ

విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రతి ఇంట్లో జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్నారు.

వివరాలు 8లో ▸



కళావైభవం..

వర్గల్ నవోదయ వేదికగా రెండు రోజుల పాటు కొనసాగిన కళాఉత్సవ్ క్లస్టర్ స్థాయి సాంస్కృతిక పోటీలు శుక్రవారం ముగిశాయి.

వివరాలు 8లో ▸



బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు.

వివరాలు 9లో ▸

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్‌గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం.

99498 49479

న్యూస్‌రీల్

సింగూరులో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం

పుల్‌కల్(అందోల్): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సింగూరు ప్రాజెక్టులోకి వరద ప్రవాహం చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండటంతో జలవిద్యుత్ అధికారులు ఒక టర్బయిన్‌ను రన్ చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. జలవిద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసిన నీరు మంజీరా బ్యారేజ్‌లోకి వెళుతోంది. దీంతో బ్యారేజ్ నుంచి రెండు గేట్‌లను ఎత్తి దిగువన ఘనపూర్ ఆయకట్టుకు వదులుతున్నారు.

గెస్ట్ లెక్చర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీ, పీహెచ్‌డీ అర్హత గల అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30 వ తేదీన వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంగ్లిష్-1, ఫిజికల్ డైరెక్టర్-1 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 9000049142, 8978684962ను సంప్రదించాలని కోరారు.

మంత్రిని కలిసిన బక్కి వెంకటయ్య



మంత్రి హరీశ్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ నూతన చైర్మన్‌గా నియామకమైన బక్కి వెంకటయ్య శుక్రవారం ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును హైదరాబాద్‌లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిల కృషితోతోనే తనకు ఈ పదవి దక్కిందన్నారు. కార్యక్రమంలో ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి, నాయకులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు రాయపోల్ విద్యార్థి



విద్యార్థి మనోజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాయపోల్ మండలం బేగంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి బి.మనోజ్ కుమార్ రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. మిల్లెట్స్ సూపర్ ఫుడ్ అనే అంశం మీద నిర్వహించిన సెమినార్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్‌ను డీఈఓతోపాటు గైడ్ టీచర్ చిన్న బ్రహ్మయ్య అభినందించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి రామస్వామి, జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చివరి మీటింగ్.. చిట్టా విప్పుదామా?

ఎమ్మెల్యేలకు ఆఖరి సమావేశం?
- నిధులు అడిగే యోచనలో జెడ్పీటీసీలు
- ఎజెండాలోని అంశాలపైనే సాధారణ చర్చ
- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



జిల్లా పరిషత్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను చర్చించి.. వాటి పరిష్కారం కోసం కీలక నిర్ణయాలు తీసుకునే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరగనుంది. అయితే.. ఎమ్మెల్యేలకు దాదాపు ఇదే చివరి సమావేశం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. జెడ్పీ సమావేశం ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తారు. వచ్చే సమావేశం ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించే లోపు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కోడ్ అమలులోకి వస్తే జిల్లా అధికార యంత్రాంగం అంతా ఎన్నికల నిర్వహణ పనుల్లో తలమునకలవుతుంటారు. అలాగే కోడ్ అమలులో ఉండగా, జెడ్పీ సమావేశంలో కొత్తగా నిర్ణయాలు ప్రకటించడం.. తీర్మానాలు చేయడం వీలుండదని అధికారులు చెబుతున్నారు. దీంతో అత్యవసర సమావేశాలు నిర్వహిస్తే తప్ప.. ఎమ్మెల్యేలకు ఇదే చివరి జెడ్పీ సమావేశం అవుతుందనే అభిప్రాయం జెడ్పీ వర్గాలు పేర్కొంటున్నాయి.

మంత్రి వస్తేనే ఎమ్మెల్యేల హాజరు

జిల్లా పరిషత్‌లో జెడ్పీటీసీలు, ఎంపీపీలతో పాటు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు కూడా సభ్యులుగా ఉంటారు. కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల జిల్లా ఉన్నతాధికారులు కొలువుదీరే ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి, వాటిని తక్షణ పరిష్కారం కోసం జిల్లా ఉన్నతాధికారులను ప్రశ్నించి పనులు చేయించేందుకు వీలవుతుంది. అయితే జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు ఈ జెడ్పీ సమావేశాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. తరచూ ఈ సమావేశాలకు గైర్హాజరు కావడం.. కొందరు ఎమ్మెల్యేలకు పరిపాటిగా మారింది. కేవలం మంత్రి హరీశ్‌రావు సమావేశానికి హాజరైతేనే ఎమ్మెల్యేలు ఈ జెడ్పీ సమావేశాలకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం జరిగే ఈ సమావేశం ఎమ్మెల్యేలకు చివరి సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

నిధులు అడిగే యోచనలో జెడ్పీటీసీలు

జెడ్పీటీసీలు తమ మండలాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు కేటాయించాలని కోరాలని భావిస్తున్నారు. జెడ్పీ జనరల్ ఫండ్స్‌తో పాటు, మరే ఇతర నిధుల నుంచి మండలానికి కొంత మొత్తాన్ని కేటాయించాలని కోరుతున్నారు. ఆరు నెలలుగా తమకు నిధులు కేటాయించలేదని, ఈసారి ఎలాగైనా నిధులు కేటాయిస్తే మండలంలో అభివృద్ధి పనులు చేసేందుకు వీలవుతుందని జెడ్పీటీసీలు పేర్కొంటున్నారు.

ఎజెండాలోని అంశాలపైనే చర్చ

శనివారం జరగనున్న జెడ్పీ సమావేశంలో ఎజెండాలోని అంశాలపైనే ప్రధాన చర్చ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాధారణ సమావేశమేనని, ఎజెండాలోని అంశాలు తప్ప.. ప్రత్యేకించి తీర్మానాలేవీ ఉండకపోవచ్చని జెడ్పీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈసారి కూడా అధికారుల పనితీరుపైనే సభ్యులు విమర్శలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.



ఎమ్మెల్యే మాణిక్‌రావుతో కలిసి ఆయా శాఖల అధికారులతో సమావేశమైన కలెక్టర్ శరత్

గడువు 72 గంటలే..

- చెరకు రైతులకు బకాయిలు చెల్లించాలి
- లేకుంటే 'ట్రైడెంట్'కర్మాగారం వేలం
- యాజమాన్యానికి కలెక్టర్ శరత్ హెచ్చరిక

జహీరాబాద్: చెరకు రైతులకు రావాల్సిన బకాయిలను 72 గంటల్లో చెల్లించాలని, లేనట్లయితే ట్రైడెంట్ చక్కెర కర్మాగారం వేలం వేయాలని కలెక్టర్ శరత్ అధికారులను ఆదేశించినట్లు జిల్లా కేన్ అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తం, ఐడీసీ చైర్మన్ ఎండీ తన్వీర్, ఎస్పీ రమణకుమార్, రైతు నాయకుడు ఢిల్లీవసంత్‌లతో కలిసి ఆయా శాఖల అధికారులతో సమావేశమయ్యారు. జహీరాబాద్ జోన్ ప్రాంత చెరకు రైతులకు ట్రైడెంట్ యాజమాన్యం ఇంకా రూ.9కోట్ల మేర చెరకు బిల్లులు బకాయి పడిందన్నారు. వీటిని ఈనెల 20వ తేదీ కల్లా చెల్లిస్తామని యాజమాన్యం రాత పూర్వకంగా హామీ ఇచ్చిందన్నారు. వారిచ్చిన గడువు ముగిసిందని, అయినా యాజమాన్యం నుంచి ఎలాంటి సమాచారం లేదన్నారు. యాజమాన్యానికి మరో 72 గంటల పాటు గడువు ఇస్తున్నామని, గడువులోగా చెల్లించకుంటే కర్మాగారాన్ని వేలం వేయాలని అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ ఆదేశించారు. కర్మాగారాన్ని నడిపించిన యాజమాన్య ప్రతినిధి వినోద్‌బేడీని ఎస్పీ పిలిపించి రైతులకు బకాయిలు చెల్లించే విషయంలో జాప్యం చేస్తున్నందుకు మందలించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైడెంట్ ఎం.డి రామ్‌నాథ్, సీవైసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, డీఎస్పీ రఘు, ఆత్మ చైర్మన్ ఎస్.పెంటారెడ్డి, మాజీ జడ్పీటీసీ పి.నర్సింహారెడ్డి, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

విద్యార్థులకు ఉపయోగాల గురించి వివరించిన శాస్త్రవేత్తలు



చిరుధాన్యాల ఆహారంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్: పోషకాలు సమృద్ధిగా కలిగి ఉన్న ఆహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త, సంస్థ సమన్వయ కర్త ఎన్.స్నేహలత మాట్లాడుతూ.. సెప్టెంబర్ మాసాన్ని పోషణ్ మాస కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, ఆరు సంవత్సరాల పిల్లలకు పోషకాహార లోపాలను నివారించేందుకు అవగాహన కల్పించారు. వంటల యాజమాన్య శాస్త్రవేత్త వి.రమేష్ మాట్లాడుతూ చిరుధాన్యాలతో తయారు చేసే ఆహారంలో ఎంతో బలవర్ధకాలు ఉన్నాయన్నారు. వీటిని ప్రతి నిత్యం ఆహారంలో తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలిపారు. చిరు ధాన్యాల నుంచి రుచికరమైన మురుకులు, లడ్డూలు, నాచోస్, కేక్‌లు ఏ విధంగా తయారు చేసుకోవచ్చనే దాని గురించి వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త జి.శైలజ మాట్లాడుతూ కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు ప్రతి నిత్యం ఎంత పరిమాణంలో తీసుకోవాలనే దానిపై వివరించారు. రోజు సమాన పరిమాణంలో తీసుకోవడం వల్ల మధుమేహం, గుండె సంబంధిత, క్యాన్సర్ వ్యాధులను అదుపులో ఉంచుకోవచ్చనే దాని గురించి తెలియజేశారు. కూరగాయలు, పండ్లలో ఉండే ఖనిజాలు, ఐరన్, పీచు పదార్థాలు, పోలిక్ యాసిడ్, పోషక విలువల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల కార్మికుడి అనుమానాస్పద మృతి

అంత్యక్రియలు నిర్వహించిన బీఆర్ఎస్ నేత



అస్తోష్ కుమార్

జహీరాబాద్ టౌన్: దాబాలో పనిచేస్తున్న ఓ బాలకార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బిహార్‌కి చెందిన దీపక్ కుటుంబం జహీరాబాద్‌కి వలసవచ్చి జీవనం సాగిస్తోంది. దీపక్ బస్టాండ్‌లో పాప్‌కార్న్ విక్రయిస్తుంటాడు. ఆయన కుమారుడు అస్తోష్ కుమార్(16) బూచినెల్లి శివారులోని ఒక దాబాలో పనిచేసేవాడు. తల్లిదండ్రులు పట్టణంలో నివసిస్తుండగా అస్తోష్ మాత్రం దాబాకు చెందిన రేకుల షెడ్‌లో ఉండేవాడు. గురువారం పనులు ముగించుకుని రూమ్‌కు వెళ్లాడు. తోటి కార్మికులు శుక్రవారం రూంకు వెళ్లగా అస్తోష్‌కుమార్ ఉరివేసుకుని ఉండటం గమనించారు. వారు వెంటనే మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ రాజు, చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్, కార్మికశాఖ అధికారులు ఆసుపత్రికి వెళ్లి పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. అస్తోష్ కుమార్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అంత్యక్రియలు నిర్వహించలేని పరిస్థితి తెలుసుకున్న మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు రాములు నేత అంత్యక్రియలు జరిపించారు.

కాళ్లకల్‌లో కల్తీ మద్యం కలకలం

మనోహరాబాద్(తూప్రాన్): ఎక్సైజ్ తనిఖీలో భాగంగా ఓ బెల్ట్ షాపులో తనిఖీలు నిర్వహించగా ఏపీ రాష్ట్ర లేబుల్ గల మద్యం బాటిళ్లు లభించాయి. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం ములుగు మండలం కొత్తూరు కావడం గమనార్హం. గురువారం నర్సాపూర్ ఎక్సైజ్ అధికారులు మనోహరాబాద్ మండలంని కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి శివారులో తనిఖీలు చేపట్టారు.

జర్నలిస్టులకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- 100 మందికి ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న జర్నలిస్టులు

పటాన్‌చెరు: జర్నలిస్టుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. గురువారం రాత్రి మండలంలోని 100మంది జర్నలిస్టులకు ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో కలిసితో ఆయన ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. అదేవిధంగా కాజిపల్లి గ్రామానికి చెందిన 30 మంది రోడ్డు నిర్వహణ బాధితులకు పట్టాలను అందజేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ రూ.100 కోట్లతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేశారన్నారు. మొదటి విడతగా ప్రభుత్వ గుర్తింపు కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశామని, అర్హులై అక్రిడేషన్ కార్డులేని జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందజేస్తామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే కృషి అభినందనీయం: అల్లం

పటాన్‌చెరు నియోజకవర్గంలో జర్నలిస్టుల సంక్షేమానికి ఎమ్మెల్యే కృషి అభినందనీయమని ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ ప్రశంసించారు. రూ.60 లక్షలతో జర్నలిస్టుల కోసం ఆరోగ్య బీమా చేయించడం చారిత్రాత్మకమన్నారు. వంద మంది జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, జడ్పీటీసీలు సుధాకర్ రెడ్డి, సుప్రజాకుమార్ గౌడ్, ఎంపీపీలు సుష్మా , దేవానందం, ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు తుమ్మల పాండురంగారెడ్డి, లలిత సోమిరెడ్డి, రోజా బాల్ రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కార్పొరేటర్లు పుష్ప నగేష్, మాజీ ఎంపీపీలు యాదగిరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం

- ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు
- రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపడుతున్న అక్రమార్కులు

జిన్నారం(పటాన్‌చెరు): రాత్రికి రాత్రే ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయి. చూస్తుండగానే అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. రెవెన్యూ అధికారులు కూల్చివేతలు జరుపుతున్నా.. అక్కడక్కడా నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. వాటిని నివారించేలా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. జిన్నారం మండలం ఖాజీపల్లి, గడ్డపోతారం, మాదారం గ్రామాలతో పాటు బొల్లారం మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రభుత్వ భూములు దర్జాగా కబ్జా అవుతున్నాయి. ఏళ్ల కాలం నుంచి ప్రభుత్వ, శిఖం భూములు కబ్జా అవుతున్నా అధికారులు కఠిన చర్యలు తీసుకోవటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా ఖాజీపల్లి గ్రామ శివారులో పలు ప్రభుత్వ, గ్రామకంఠం భూముల్లో నిర్మాణాలు చేపడుతున్నారనే ఫిర్యాదులు రావటంతో రెవెన్యూ అధికారులు స్పందించి కూల్చివేతలు జరిపారు. మళ్లీ నిర్మాణాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని 11సర్వే నంబర్ గల ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. ఇటీవల ఆర్ఐ ఆధ్వర్యంలో కూల్చివేతలు చేసిన కబ్జాలు మాత్రం ఆగటం లేదు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లోని ప్రభుత్వ స్థలాలు, కుంట స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. బొల్లారంలో మాత్రం స్థానిక నాయకుల కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో విలువైన ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎప్పటికప్పుడు స్పందిస్తున్నాం: రవికుమార్, తహసీల్దార్ ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండా ఉండేలా చూస్తున్నాం. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పలు అక్రమ నిర్మాణాల విషయం తమదృష్టికి రాగానే కూల్చి వేయించాం. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలు జరిగితే ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలి.

సిద్దిపేటకు ప్యాసింజర్ రైలు నడపండి

రైల్వే బోర్డ్ చైర్మన్‌కు ఎంపీ వినతి



రైల్వే బోర్డ్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ ప్రభాకర్ రెడ్డి

సిద్దిపేటజోన్: సిద్దిపేటకు ప్యాసింజర్ రైలును నడపాలని కేంద్ర రైల్వే బోర్డ్ చైర్మన్, సీఈఓ జయవర్మను మెదక్ ఎంపీ ప్రభాకర్ రెడ్డి కోరారు. శుక్రవారం ఢిల్లీలో భారతీయ రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన రైల్వే బోర్డ్ చైర్మన్ ను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై వినతిపత్రాన్ని అందచేశారు. సిద్దిపేట ప్రజల చిరకాల వాంఛ సిద్దిపేట రైల్వే లైన్ ను సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావు కృషి వల్ల సాధించుకునానమని, సిద్దిపేట వరకు రైల్వే లైన్ నిర్మాణం పూర్తి అయినందున ప్యాసింజర్ రైలును నడపాలని కోరారు.

పారదర్శక ప్రగతి సాధిస్తాం: ఈఓ

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మ ఆలయ ఆ స్తులను వెల్లడించి పారదర్శకంగా ప్రగతి సాధిస్తామని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఈఓగా బాధ్యతలు చేపట్టిన అనంతరం చైర్మన్ బాలాగౌడ్‌తో కలసి మాట్లాడారు. ఆలయ ఆస్తులను చట్టబద్ధంగా ప్రకటిస్తామని, చైర్మన్, పాలకవర్గంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామన్నారు. సీఎం కేసీఆర్ ఆలయ అభివృద్ధికి కేటాయించిన రూ.100 కోట్లతో ఏడుపాయల రూపురేఖలు మారుస్తామన్నారు. ఈ నెల 26న దేవాదాయ, ధర్మా దాయ శాఖ ఇంజనీరింగ్ అధికా రులు, స్థపతి కలసి వస్తున్నారని, వారి సూచనలు మేరకు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు.

స్పందించకుంటే సమ్మె ఉధృతం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి సాయిలు
- అంగన్‌వాడీలతో చర్చలు జరపాలని డిమాండ్



రిలే నిరాహార దీక్ష చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

సంగారెడ్డి టౌన్: అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి సాయిలు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులతో చర్చలు జరిపి సామరస్యంగా సమస్యకు పరిష్కారం చూపాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. భయభ్రాంతులకు గురిచేస్తూ, బెదిరింపులకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అంగన్‌వాడీ ఉద్యోగులు రోడ్డుపైకి రావడానికి ప్రభుత్వమే కారణమని మండిపడ్డారు. విధానాలు మార్చుకొని న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీ ఉద్యోగులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని, దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యాదగిరి, జమున, మంగా, శశికళ, రజిత తదితరులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ బాక్స్ దొంగల ఆటకట్టు

- నలుగురు నిందితుల అరెస్ట్
- రూ.4లక్షల నగదు, రెండు ఆటోల సీజ్
- డీఎస్పీ రఘు వెల్లడి



మాట్లాడుతున్న డీఎస్పీ రఘు

జహీరాబాద్ టౌన్: ఇళ్ల నిర్మాణానికి ఉపయోగించే సెంట్రింగ్ బాక్స్‌ల చోరీలకు పాల్పడుతున్న దొంగలను పోలీసులు పట్టుకున్నారు. జహీరాబాద్ డీఎస్పీ రఘు శుక్రవారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ..పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సోహెల్(21), న్యాల్‌కల్ మండలం మిర్జాపూర్(బి)కి చెందిన అహ్మద్(24), పట్టణంలోని గుల్షన్‌నగర్‌కు చెందిన జమీర్(24), పట్టణంలోని రాంనగర్‌కు చెందిన షోయబ్(21) ఆటో డ్రైవర్లు. నలుగురు ముఠాగా ఏర్పడి సెంట్రింగ్ బాక్స్‌ల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. పట్టణంలోని గడి ప్రాంతానికి చెందిన ఎండీ సోహెల్ అహ్మద్(28) సెంట్రింగ్ కాంట్రాక్ట్ పనులు చేస్తున్నాడు. పట్టణంలోని గుల్షన్‌నగర్‌లో ఓ ఇంటికి సెంట్రింగ్ పనులు పూర్తి చేసి ఈ నెల 20 సెంట్రింగ్ బాక్స్‌లను అక్కడే ఓ గదిలో పెట్టి తాళం వేసి భద్రపరిచాడు. గది తాళం పగులగొట్టి సెంట్రింగ్ బాక్స్‌లు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాక్స్‌లు చోరీ జరిగిన విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ సోహెల్ అహ్మద్.. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం హుగ్గెల్లి వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా.. అనుమానం రావడంతో ఆటోలో వెళుతున్న నలుగురు వ్యక్తులను ఆపారు. పోలీసులను చూసి వారు ఆటోను వేగంగా నడపడంతో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. నలుగురిని విచారించగా చేసిన నేరాలను వారు ఒప్పుకున్నారు. జహీరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో సెంట్రింగ్ బాక్స్‌లు, మోటారు సైకిళ్లను చోరీ చేసినట్లు చెప్పారు. రూ.4 లక్షల నగదు, రెండు ఆటోలను సీజ్ చేసినట్లు డీఎస్పీ రఘు వివరించారు. సమావేశంలో జహీరాబాద్ పట్టణ సీఐ రాజు, ఎస్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కలదాడిలో మహిళకు గాయాలు


గాయపడిన మహిళ

చేర్యాల(సిద్దిపేట): పోతిరెడ్డిపల్లి గ్రామంలో కుక్కలు దాడి చేయడంలో కిష్టవ్వ తీవ్రంగా గాయపడింది. గ్రామంలో కుక్కలు వీరవిహారం చేస్తూ గ్రామస్తులను భయకంపితులను చేస్తున్నాయి. రెండు నెలల్లో 12 మందిపై కుక్కలు దాడి చేశాయని స్థానికులు వాపోయారు. కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినా ఫలితం లేదు. ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడి ఆత్మహత్య


మహేశ్‌బాబు మృతదేహం

పటాన్‌చెరు టౌన్: ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెడ్ కానిస్టేబుల్ మహమ్మద్ అలీ కథనం ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన దండు మహేశ్‌బాబు(20) స్థానికంగా కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చిన్నతనంలో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అప్పటి నుంచి నరాల సమస్యతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి తాను చనిపోతానని తల్లి రాజేశ్వరి, చిన్నమ్మకు చెప్పడంతో వారు సముదాయించారు. కానీ అర్ధరాత్రి రెండు గంటల సమయంలో దూలానికి చీరతో ఉరివేసుకుని ఉండటాన్ని మహేశ్ తల్లి రాజేశ్వరి గమనించింది. మృతదేహాన్ని పోలీసులు పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


రూప్‌సింగ్(ఫైల్)

చేగుంట(తూప్రాన్): మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మాసాయిపేట మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామంతపూర్ తండాకు చెందిన చవాన్ రూప్‌సింగ్(32) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై డబ్బుల కోసం గురువారం రాత్రి భార్య చవాన్ పీరీతో గొడవపడ్డాడు. భార్య తన బంధువులను పిలిచేందుకు బయటకు వెళ్లి వచ్చేలోగా రూప్‌సింగ్ ఉరి వేసుకొని కనిపించాడు. వెంటనే తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చీటింగ్ కేసులో ఏడాది జైలు

సిద్దిపేటకమాన్: చీటింగ్ కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధించారని సీఐ రవికుమార్ తెలిపారు. సిద్దిపేట కంచరి బజార్‌కు చెందిన ఉల్లోజు రమేష్ చిన్నకోడూర్ మండలం గోనెపల్లి గ్రామానికి చెందిన జంగిటి తిరుపతి నుంచి 2015లో నగలు తయారు చేసిస్తానని 12 తులాల బంగారం తీసుకున్నాడు. తర్వాత నగలు చేయకుండా బెదిరించడంతో బాధితుడు తిరుపతి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ సైదులు కేసు నమోదు చేశారు. అనంతరం సిద్దిపేట కోర్టులో చార్జ్‌షీట్ వేశారు. నిందితుడిపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి శ్రావణి శుక్రవారం తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

ఫీవర్రీ

- ఇంటింటా జ్వర పీడితులు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు


హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

హుస్నాబాద్: విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రతి ఇంట్లో జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధులు అధికం కాగా డెంగీతో రక్తకణాలు తగ్గడం సమస్యగా మారుతోంది.

రోజూ పదుల సంఖ్యలో..

హుస్నాబాద్ పట్టణం, పరిసర గ్రామాల్లో రోజు రోజుకు విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోజూ పదుల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. సీజనల్ వ్యాధుల ప్రభావంతో ఆస్పత్రిలో ప్రతీ రోజు 200 మందికి పైగా ఔట్ పేషెంట్లు, 100లోపు ఇన్ పేషెంట్లు వైద్య పరీక్షలు చేయించుకొని చికిత్స పొందుతున్నారు. వీరిలో మలేరియా, టైఫాయిడ్ లక్షణాలు ఉన్నప్పటికీ పరీక్షల్లో నెగెటివ్‌గా నిర్ధారణ అవుతోంది. వాతావరణంలో మార్పులు, కలుషిత నీటితో ప్రజలు వైరల్ ఫీవర్ భారిన పడుతున్నారు. వారం రోజులుగా ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువైంది. ఇప్పటికే హుస్నాబాద్, అక్కన్నపేటలో రెండు డెంగీ కేసులు నమోదు కాగా పరిసర ప్రాంతాలను శానిటేషన్ చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈనెల 22వ తేదీ వరకు ఔట్ పేషెంట్లు 2,304, ఇన్ పేషెంట్లు 462, వైరల్ ఫీవర్ 228 కేసులు నమోదయ్యాయి.

నాలుగు రోజులైంది



నాలుగు రోజులుగా జ్వరం, విరోచనాలు, జలుబుతో బాధపడ్డాను. లోకల్ డాక్టర్లు మందులు ఇచ్చినా నయం కాలేదు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన. డాక్టర్లు మందులు ఇచ్చి గ్లూకోజ్ ఎక్కించారు. ఇక్కడికి వచ్చిన తర్వాత జ్వరం తగ్గుముఖం పట్టింది. పూర్తిగా నయం కాగానే ఇంటికి వెళ్తా.
– స్వరూప, ఆరపల్లె

వైరల్ ఫీవర్ కేసులే ఎక్కువ



ఎక్కువగా వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి. జ్వర పీడితులకు రక్త పరీక్షలు, మెరుగైన చికిత్స, మందులు అందిస్తున్నాం. రక్తకణాలు తగ్గిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నాం. హుస్నాబాద్, అక్కన్నపేటలో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం వారు ఆరోగ్యంగానే ఉన్నారు. ఆస్పత్రిలో 24 గంటల పాటు వైద్య సేవలు అందిస్తున్నాం.
– రమేష్‌రెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్, హుస్నాబాద్

నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

సిద్దిపేట సీపీ శ్వేత


మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని, టెక్నాలజీ సాయంతో ఎన్నో కేసులను చాకచక్యంగా ఛేదించామని సీపీ శ్వేత పోలీసు అధికారులకు పిలుపునిచ్చారు. టెక్నాలజీ వినియోగంపై తన కార్యాలయంలో పోలీసు అధికారులు, టెక్ టీం రైటర్లు, సైబర్ వారియర్స్‌కు శుక్రవారం ఆమె వర్క్‌షాప్ నిర్వహించారు. సి ట్రేస్ అప్లికేషన్ నూతన టెక్నాలజీ అద్భుతంగా ఫలితాలనిస్తోందని, అధికారులందరూ దానిని అందిపుచ్చుకోవాలని సూచించారు. నూతన సాఫ్ట్‌వేర్‌ను త్వరలో అన్ని పోలీసు స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలకు అందజేస్తామని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఫిర్యాదు రాగానే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు శ్రీనివాస్, శంకర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు అడ్మిన్ శ్రీనివాసరావు, లా అండ్ ఆర్డర్ మల్లారెడ్డి, సీఐలు కృష్ణారెడ్డి, రవికుమార్, భానుప్రకాష్, భిక్షపతి, దుర్గ, టెక్ టీంరైటర్లు నరేష్, మల్లిఖార్జున్, శ్రీనివాస్, నాగరాజు, భాస్కర్, సైబర్ వారియర్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

దౌల్తాబాద్(దుబ్బాక): పోలీసులు అంకిత భావంతో విధులు నిర్వహించి మెరుగైన సేవలు అందించాలని సీపీ శ్వేత సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆమె ఏసీపీ రమేష్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. స్టేషన్‌లో సీసీ కెమెరాల పనితీరు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాత్రి సమయల్లో పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. పోలీసు అధికారులు తమ పరిధిలోని గ్రామాలను సందర్శించి ప్రజలకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐ కమలాకర్, ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కళావైభవం.. సాంస్కృతిక సౌరభం


విద్యార్థి నృత్యవిన్యాసం


బొమ్మలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ రాజేందర్, న్యాయనిర్ణేతలు

వర్గల్ నవోదయలో ముగిసిన క్లస్టర్‌స్థాయి పోటీలు

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ నవోదయ వేదికగా రెండు రోజుల పాటు కొనసాగిన కళాఉత్సవ్ క్లస్టర్ స్థాయి సాంస్కృతిక పోటీలు శుక్రవారం ముగిశాయి. సంగీత కచేరీలు, నృత్య ప్రదర్శనలు, చిత్రకళా విన్యాసాలు విద్యార్థుల్లో కళాత్మకతను చాటాయి. రీజినల్ స్థాయి పోటీల్లో చోటు లక్ష్యంగా విద్యార్థులు తమ కళా నైపుణ్యాలను ప్రదర్శించారు. పోటీలకు తెలంగాణలోని ఆదిలాబాద్, నల్గొండ, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, రంగారెడ్డి, వర్గల్ నవోదయ విద్యాలయాలకు చెందిన 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. పాటలు, గ్రూప్ సాంగ్స్, సోలో డ్యాన్స్, చిత్రలేఖనం, బొమ్మల తయారీ తదితర 10 అంశాల్లో చక్కని ప్రదర్శనతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా పొట్టి శ్రీరాములు యునివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌చారి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కృష్ణారెడ్డి, సాజిద్‌బిన్ అమర్, రేడియో ఆర్టిస్ట్ నీరజ, ప్రముఖ సింగర్ అభిరాం, జార్జా కొటగిరీకర్, కాంతారావు, నటా సాయి, హర్షిత వ్యవహరించారు.


విద్యార్థిని నృత్యాభినయం

విజేతలు వీరే..

వోకల్ క్లాసికల్ విభాగంలో క్షేత్ర (వరంగల్ నవోదయ), సాయికుమార్ (వరంగల్), వోకల్ ఫోక్‌లో మనస్విని (కరీంనగర్), భానుప్రకాశ్ (మహబూబ్‌నగర్), క్లాసికల్ డ్యాన్స్‌లో దివ్య (ఖమ్మం), శర్వానంద్ (ఖమ్మం), ఫోక్ డ్యాన్స్‌లో సింధూజ (వరంగల్), రాహుల్ (వరంగల్), ఇన్‌స్ట్రుమెంట్ మ్యూజిక్‌లో విక్టర్ పాల్ (వరంగల్), ఇన్‌స్ట్రుమెంట్ మెలోడిలో శెరియా (కరీంనగర్), యూనుస్(నిజామాబాద్), సోలో డ్రామాలో అవనిశుక్ల (నల్గొండ), అరవింద్ (వరంగల్), విజువల్ ఆర్ట్‌లో స్వాతి (వరంగల్), అవినాశ్(వరంగల్), బొమ్మల తయారీలో అంజలి (వరంగల్), విలోక్ ఆదిత్య (వరంగల్), త్రీడీ విజువల్ ఆర్ట్‌లో అశ్విని (మెదక్), అనిల్(వరంగల్) విజేతలుగా నిలిచారు.

క్రీడోత్సాహం


వాలీబాల్ విజేత నర్సాపూర్ జట్టుతో ఆర్సీఓ ప్రభాకర్

వర్గల్(గజ్వేల్): వర్గల్ జ్యోతిబాపూలే గురుకులం వేదికగా జిల్లాస్థాయి అండర్ 17 బాలికల ఆటల పోటీలు శుక్రవారం రెండో రోజుకు చేరాయి. అథ్లెటిక్స్ పోటీలు ముగియగా, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడలు తుదిదశకు చేరాయి. విజేతల వివరాలను ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి వెల్లడించారు. డిస్కస్‌త్రోలో అశ్విని(వర్గల్ గురుకులం) ప్రథమ, మనితేజస్విని (గజ్వేల్) ద్వితీయ, మల్లీశ్వరి (వర్గల్) తృతీయ స్థానం సాధించారు. 3000 మీటర్ల పరుగులో హర్షిత (వర్గల్), శ్రీహర్షిణి (గజ్వేల్), శ్రీహిత (ముత్తంగి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 1500 మీటర్ల పరుగులో కావ్య (గజ్వేల్), నవనీత (వర్గల్), గాయత్రి (ఆర్సీపురం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 100 మీటర్ల పరుగులో దుర్గాభవాని (ఆర్సీపురం), నవనీత (వర్గల్), కావ్య (గజ్వేల్), 800 మీటర్లలో శ్రీహర్షిణి (గజ్వేల్), లావణ్య (వర్గల్), కావ్య (గజ్వేల్), 400 మీటర్ల పరుగులో కావ్య (గజ్వేల్), నందిని (చింతమడక), కల్యాణి (గజ్వేల్), 200 మీటర్ల పరుగులో భవాని (సదాశివపేట), అక్షయ (ముత్తంగి), వైష్ణవి (ముత్తంగి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వాలీబాల్ ఫైనల్ పోరులో నర్సాపూర్ జట్టు బాలికలు, ముత్తంగి జట్టును ఓడించి విజేతలుగా నిలిచారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

రాయపోలు(దుబ్బాక): దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పట్టుకున్నట్టు ఎస్‌ఐ రఘుపతి తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఇటీవల కొత్తపల్లి, రాంసాగర్‌లలోని ఎల్లమ్మ, పెద్దమ్మ దేవాలయాల్లో హుండీ సొమ్ము చోరీ జరిగింది. ఆయా గ్రామాల నుంచి ఫిర్యాదులు అందాయి. అయితే శుక్రవారం ఆరెపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గజ్వేల్‌కు చెందిన పర్వతం నర్సింహులుతో పాటు మరొక బాలుడు ద్విచక్రవాహనంపై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా రాయపోలు, గజ్వేల్, గౌరారం, బేగంపేట, కుకునూరుపల్లి పోలీసుస్టేషన్ల పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడయిందని ఎస్‌ఐ తెలిపారు. వారిపై కేసులు నమోదుచేసి నర్సింలును రిమాండుకు, మైనర్ బాలుడిని జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు.

కష్టాలను పాటలుగా మార్చిన ఘనత గద్దర్‌దే

సంతాపసభలో ప్రొఫెసర్ కోదండరాం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

నర్సాపూర్ రూరల్: తెలంగాణ ప్రజల కష్టాలను పాటలరూపంలో తెలియజేసేలా కళాకారులకు నేర్పించిన ఘనత ప్రజాగాయకుడు గద్దర్‌కే దక్కిందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలో జజ్జనకరి కళాబృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గద్దర్ సంతాపసభలో ఆయన మాట్లాడారు. అనేక మంది కవులు, కళాకారులు ఉన్నా గద్దర్ ప్రత్యేకత శైలితో ప్రజల కష్టాలను పాటలుగా వినిపించడంలో సక్సెస్ అయ్యారని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా గద్దర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. గద్దర్ కూతురు వెన్నెల మాట్లాడుతూ గద్దర్ ప్రజలకు తన జీవితాన్ని అంకితమిచ్చారని, పేద బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచారని అన్నారు. నేటి యువత గద్దర్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం జజ్జనకరి కళాబృందం ఆలపించిన పాటలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాజిరెడ్డి, ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ, నాయకులు సుహాసిని రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, గంగాధర్, కళాకారులు రమేశ్, శ్రీశైలం,యాదగౌడ్ పాల్గొన్నారు.

దాబాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

హుస్నాబాద్‌రూరల్: అనుమతులు లేకుండా దాబాలలో మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మద్యం సేవిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. అక్కన్నపేట మండలం గండిపెల్లి, రామవరం గ్రామాలకు చెందిన 15 మంది పట్టుబడినట్టు సమాచారం.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రముఖ మెజీషియన్ సామల వేణు



మాట్లాడుతున్న వేణు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ప్రముఖ అంతర్జాతీయ మెజీషియన్ సామల వేణు కోరారు. ప్రజ్ఞాపూర్‌లోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలలో రోటరీ ఇంటరాక్ట్ క్లబ్‌ను శుక్రవారం ప్రారంభించారు. తర్వాత గజ్వేల్ ప్రగతి ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన ప్రేరణ సదస్సుల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉన్నత చదువుతోనే మంచి గుర్తింపు లభిస్తుందని, వ్యసనాలతో సమయాన్ని వృథా చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా సెయింట్ మేరీస్ విద్యానికేతన్‌లో ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్లుగా సిరి, అద్వీత్, సెక్రటరీలుగా జాగృతి, వర్షిత్, ట్రెజరీలుగా ప్రణవ్‌సింహ, ప్రహలియాలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు బాబుగౌడ్, కోశాధికారి శ్రీనివాస్‌గౌడ్, పూర్వ అధ్యక్షుడు జగదీశ్వర్, కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘బాల సాహిత్య సృజన’లో జక్కాపూర్ విద్యార్థిని


విద్యార్థినికి పుస్తకాన్ని అందిస్తున్న హెచ్‌ఎం షౌకత్ అలీ

సిద్దిపేటరూరల్: ఉభయ రాష్ట్రాలకు చెందిన 140 మంది బాల సాహిత్య వేత్తల వివరాలతో కూడిన ‘బాల సాహిత్య సృజనకారులు’ పుస్తకంలో జక్కాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థిని పల్లె వైష్ణవికి స్థానం లభించిందని హెచ్‌ఎం షౌకత్ అలీ సంతోషం వ్యక్తం చేశారు. పుస్తక సంపాదకుడు పెందోట వెంకటేశ్వర్లు పంపించిన ఆ పుస్తకాన్ని శుక్రవారం వైష్ణవికి అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భైతి దుర్గయ్య, పద్మ, రాజు, రాజేందర్, లక్ష్మి నర్సయ్య, మల్లారెడ్డి, తిరుపతి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

డీఈవో శ్రీనివాస్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యావ్యవస్థలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులకు జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఉపాధ్యాయులకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ముఖ్యఅతిథిగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ జాతీయ అధ్యక్షుడు సిమ్లా యూనివర్సిటీ ప్రొఫెసర్ అహ్లువాలియా ఆన్‌లైన్‌లో హాజరై అంతర్జాలంలో అందుబాటులో ఉన్న వనరులను వినియోగిస్తూ, నవీన పద్ధతులలో విద్యార్థులకు బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ సీహెచ్ మధుసూదన్, డాక్టర్ మహేష్, భైరయ్య, కృష్ణయ్య, సౌమ్య, ప్రొఫెసర్ రాజేశ్వరరావు, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రామస్వామి, ఫిజికల్ సైన్సు ఫోరం జిల్లా కన్వీనర్ సాదాత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పట్టు రైతులను ఆదుకోండి


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా పట్టు రైతుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. శుక్రవారం రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి, జనగామ మార్కెట్లలో రైతులు విక్రయాలు జరిపినా నెల రోజుల వరకు డబ్బులివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా పట్టు రైతుల సంఘం గౌరవ అధ్యక్షుడు పెద్దోళ్ల నరసింహులు, అధ్యక్షుడు ఐలయ్య, ఉపాధ్యక్షుడు పీఎస్ యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, సహాయ కార్యదర్శి దేవయ్య, కోశాధికారి రాగుల రాజు పాల్గొన్నారు.

టవర్‌పై నుంచి జారిపడి యువకుడి మృతి


రంజిత్‌కుమార్ (ఫైల్)

దుబ్బాక రూరల్: నెట్‌వర్క్ టవర్‌పై నుంచి జారిపడి యువకుడు మృతి చెందాడు. రామక్కపేట బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం ఈ దారుణం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు కథనం ప్రకారం మెదక్ జిల్లా చేగుంట మండలం ఉల్లితిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన కమ్మరి రంజిత్‌కుమార్(30) నెట్‌వర్క్‌లో టెక్నిషియన్‌గా పని చేస్తున్నాడు. గురుకుల పాఠశాలలో కొన్ని రోజులుగా నెట్‌వర్క్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో నెట్‌వర్క్ సిబ్బందికి తెలపడంతో శుక్రవారం ముగ్గురు టెక్నిషియన్‌లు నెట్‌వర్కును పరిశీలించారు. అయితే భవనంపై ఉన్న టవర్ ఎక్కి సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రంజిత్‌కుమార్ తండ్రి వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశం గ్రామ పరిధిలో ఈ నెల 10న ఓ వ్యక్తి రోడ్డు పక్కన పడి ఉండటంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 18న రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన వాహనం

ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కంది మండలంలోని బ్యాతోల్‌కు చెందిన సురేష్(22), అతడి బంధువు శివంపేట్‌కు చెందిన విశ్వనాథ్ కలిసి గురువారం రాత్రి ఇస్నాపూర్‌కు వచ్చారు. తిరిగి బైక్‌పై శుక్రవారం తెల్లవారుజామున బ్యాతోల్‌కు వెళ్తున్న క్రమంలో లక్దారం సమీపానికి రాగానే వీరి బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో సురేష్ అక్కడికక్కడే మృతి చెందగా విశ్వనాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన విశ్వనాథ్‌ను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడి సోదరుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రోడ్డు ప్రమాదంతో మృతి చెందిన వ్యక్తి

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. రంజోల్ డైమండ్ హోటల్ వద్ద రోడ్డు వ్యక్తి దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు శవాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తరలివచ్చిన అభిమానులు

- ఘనంగా పట్నం మాణిక్యం జన్మదిన వేడుకలు
- గణేశ్ గడ్డ దేవాలయంలో పూజలు
- అంబులెన్స్, కుట్టుమిషన్లు, వికలాంగుల స్కూటీలు పంపిణీ


కేక్ కట్ చేస్తున్న పట్నం మాణిక్యం

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం జన్మదిన వేడుకలు శుక్రవారం జిల్లా కేంద్రం సంగారెడ్డిలో ఘనంగా జరిగాయి. నియోజకవర్గం కార్యకర్తలు, అభిమానులతో గణేశ్ గడ్డ దేవాలయంలో మాణిక్యం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అభిమానులతో కలిసి సంగారెడ్డి పట్టణం ప్రధాన రహదారుల వెంట భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక ఐబీ వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన భారీ గజమాలతో సత్కరించారు. అక్కడి నుంచి గోకుల్ కన్వెన్షన్ హాల్ కు చేరుకున్న మాణిక్యం యువసేన ఫంక్షన్ హాలులో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్నం మాణిక్యం ఒక అంబులెన్స్, మహిళలకు కుట్టు మిషన్లు, వికలాంగులకు స్కూటీలను పంపిణీ చేశారు.

హాజరైన ప్రముఖులు...

మాణిక్యం జన్మదిన వేడుకలకు జిల్లాలోని ప్రముఖులు హాజరయ్యారు. కలెక్టర్ శరత్ తో పాటు హ్యాండ్లూమ్ చైర్మన్ చింతా ప్రభాకర్ హాజరయ్యారు. వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్లు, అభిమానులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.